# భోగరాజు పార్వతీశము జగ్గు

కథకులు కాగితాల మధ్య పుట్టరు. పుస్తకాల మధ్య ఎదగరు. కథ చెప్పడం అనేదే గొప్ప కళ! కొందరికి అది జన్మతః వచ్చేస్తుంది. అలాటివాళ్లు రాసినా రాయకపోయినా చెప్పే కథలో బోలెడు వినోదం, విశేషం వుంటాయి. ఆ మాటకొస్తే ప్రతి ఇంట్లో ఓ కథకుడు వుంటాడు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆశ్చర్యపోతాం వాళ్ల కళకు! అలా తటస్థించినదే భోగరాజు పార్వతీశము జగ్గు కథ... ఇందులోని దొడ్డమ్మ భలే లైవ్ క్యారెక్టర్. మామూలు విషయాన్ని ఓ విశేషంగా మలచడం వెనుక గల కాలక్షేపం ఈ కథ ఇతివృత్తం. ఈ కథలోని హాస్యం వెనుక దారుణమైన విషాదం వుంది. సరిగ్గా ఈ పాయింటే నా చేత ఈ కథ రాయించింది. నేను రాసిన కథల్లో నాకు అమితంగా నచ్చిన కథ ఇది.

**వల్లూరి రాఘవరావు**

"పాయిఖానాలో స్టీలు జగ్గు యేమిటండీ ఖర్మం? ఇంత దివ్యమంగళకరమైన సాధనాన్ని అక్కడ వుంచారేమీ? మహాచోద్యంగా వుంది, ఏమిటీ త్రాష్టం?" అంటూ నల్లజర్ల కరణం ఆరా తీసినాడు.

ఆ ప్రశ్న మా యింట అయిదేళ్లుగా వినబడుతున్నదే! ప్రతి అతిథీ ఆ వైనాన్ని తెలుసుకొని అటువంటి త్రాష్టానికి పాల్పడ్డ స్వాతంత్ర్యసమరయోధుడూ, మా దూరపుచుట్టం అయినటువంటి భోగరాజు పార్వతీశమును నాలుగు బూతులు దోకి పోయేవారు.

-మాదుక్కలా వుండే ఆ స్టీలు జగ్గు పాయిఖానాలోకి చేరడం వెనుక గల మానవశారీరకదౌర్బల్యాన్ని గురించి యెవరూ జాలిపడడం నే చూడలేదు. అలా జాలిపడనివ్వని శిల్పంలో ఆ జగ్గు గురించిన కథను మా దొడ్డమ్మ వైనవైనాలుగా చెప్పేది. అది వింటే మీకయినా రక్తం వుడికిపోక మానదు. అలాటి వొక దొడ్డమ్మే వుండి వుంటే చెహోవ్ కథారచనలో మరెంత చెలరేగిపోయేవాడో కదా!

-స్టీలు జగ్గు కథ మాత్రం ఆమె నోటి వెంట వింటేనే శ్రోతకు సార్థకత. మానవుడి దేశభక్తినీ, పోరాటపటిమనూ, సంస్కారాదులనూ అజీర్తి అనబడే వ్యాధి ఏ స్థాయిలో మట్టం చేయగలదో తెలిసి మనం ఆశ్చర్యపోతాం. ఇక్కడ నుంచి కథ మా దొడ్డమ్మ చేత చెప్పిస్తాను.

000

"-పాయిఖానాలో స్టీలు జగ్గు యేమిటండీ చోద్యం?" నల్లజర్ల కరణం అడిగినాడు!

"-మరీ చోద్యమే నాయనా! ఆ భోగరాజు పార్వతీశం గాడ్దె కొడుకు చేసిన పని ఇది."

"-యెవడు ఆ నరసాపురం సరుకా?"

"-మా బాగా చెప్పావు! ఆ వెధవే... పెద్దాయన తద్దినం జరుగుతుంటే యెండన పడి రొప్పుకుంటూ వచ్చాడు గుంట వెధవ!"

"-గుంట వెధవ ఏమిటండీ? వాడికి అరవై పై చిలుకు గదా వయసు!"

"-నా ముందు గుంటడే లేరా! సరాసరి వంటింటి పెణక దగ్గరకొచ్చి, 'పిన్నీ కాసిని నీళ్లివ్వమ్మా' అన్నాడు. దాహానికని మడి గూడా లెఖ్ఖ జమా చేయకుండా అదుగో ఆ జగ్గుతోనే నీళ్లు వాడి యెదాన కొట్టాను."

"-తాగలేదూ?"

"-తాగితే గొడవేముందిరా వెర్రినాగన్నా! అట్నుంచి అటే దాన్ని పట్టుకొని పాయిఖానాలోకి పరిగెత్తాడు. వంటడావిడిలో నేనూ చూళ్లేదు. తీరా మన బుచ్చిగాడు చూసి చెప్పాడు. ఏం పోగాలం వెధవకి? ఎద్దులా ఎదిగాడు, అదేనా పెద్దమనిషి పని? పైగా గాంధీ గారితో కలిసి తిరిగాడట గాడ్దె కొడుకు! ఇదేనా పెద్దాయన వీడికి నేర్పింది? దేశానికి స్వాతంత్ర్యం ఇలాగేనా వీళ్లు తెచ్చింది? ఆ మట్ను వెధవని గుంజకి కట్టించేమని బెత్తాయిస్తే మా వెధవలు వొక్కడూ వినలేదు! వెధవని వీపు చీరేద్దును!" అంటూ మా దొడ్డమ్మ వూపిరి పీల్చుకోడానికి ఆగింది.

అర్జెంటయితే అడగాలి గాని అలా స్టీలు జగ్గులు పట్టుకుపోవడమే? అనిపించింది నాకు (అరవై అయిదోసారి 'కూడా).

"-బానే వుంది జంబుడం! ఈ సారి నరసాపురం వెళ్లినపుడు వెధవని కడిగేస్తాను. నువ్వూరుకో పిన్నీ. వెధవ జగ్గు పోతే పోయింది. మరిహ అలాటి త్రాష్టుడిని ఇంటికి రానీకుండా చేశావు!" అంటూ వీధరుగుమీంచి కిందికి దూకి, "మరిహ వస్తా! అవతల స్టీమరు పోయిందంటే మాకాని పని అవుతుంది" అంటూ పోచుకోలు పురాణమంతా వోపిగ్గా ఆనందించి లేచ్చక్కా పోయాడు నల్లజర్ల కరణం.

మా దొడ్డమ్మ తృప్తిగా నిట్టూర్చి బోడిగుండుపై బట్టను విలాసంగా సరిచూసుకొని పెరటిలోకి వెళ్లింది.

000

ఆషాఢమాసపు వుదయం అది. జోరున వాన పడుతుండగా ఇరవై యేళ్ల కుర్రవాడొకడు మా వరండా లోనికి వొక్కసారి తుళ్లినాడు. ఒళ్లంతా తడిసి ముద్దయిపోయింది. ఆ విషయంపై అతడు అంత పట్టింపు లేనట్టు వున్నాడు. కుర్రవాని చేతిలో వొక ప్లాస్టిక్కు కవరుతో యేదో వస్తువుంది. దానిని అమితశ్రద్ధగా తెచ్చినాడు.

"-నేను భోగరాజు వారబ్బాయిని. మాది నరసాపురం" అన్నాడు బెరుకు బెరుకుగా.

తుండు ఇచ్చినాను. దానితో తల తుడుచుకోసాగాడు.

ఈ లోగా మా దొడ్డమ్మ వచ్చి ఆరా తీసినది. "-హోర్నీ, నువ్వటరా? మీ నాయనెలా వున్నాడు? అంతా కులాసానేగా?" అంటూ బోసిగా నవ్వింది. "వీడు పార్వతీశము కొడుకు" అని పరిచయం చేసింది నాకు.

"-ఏది... మన స్టీలు జగ్గు..." అర్థోక్తిగా అడిగాను.

"-వాడే వాడే!" అన్నది.

అంతకు ముందు పార్వతీశము పేరు చెబితేనే భగ్గుమనే మా దొడ్డమ్మకు ఇంత సౌహార్దం ఎక్కడ నుంచి వచ్చింది? బహుశా వాన సమయం మనిషిలో శత్రుత్వాన్ని పోగొడుతుందేమో? నాకు మరో అనుమానం కలిగింది. అసలు పార్వతీశము అనబడే మనిషే లేకుండా మా దొడ్డమ్మకు ఎటువంటి కరెంటు

అఫైరూ చర్చకు వుండేది కాదు. అంచేత ఆ కృతజ్ఞతతో అలాగున మంచితనం చూపిందని అనుకున్నాను.

"-ఇది స్టీలు జగ్గు అండీ!" అన్నాడు ఆ కుర్రవాడు సర్రున ప్యాకెట్ చింపుతూ.

"-అయితే?" అంది మా దొడ్డమ్మ అనుమానంగా.

"-వోహ మారెప్పుడో తమ ఇంట స్టీలు జగ్గును తప్పనిసరై పాయిఖానా అవసరం కోసం మా నాయన వాడినాడట. అందువల్ల దుక్క వంటి ఆ జగ్గును మరల మీరు వాడలేదనీ, పారేయలేదనీ, దానిని అచ్చటనే వుంచారనీ తెలిసింది. నల్లజర్ల కరణం గారు మొన్న మా యింటికొచ్చి విషయం చెప్పారు. మీకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయుటకు ఈ కొత్త జగ్గు ఫిరాయించి పాత జగ్గు బెత్తాయించుకు రమ్మని మా నాయన పంపినాడు" అని టకటకా చురుగ్గా చెప్పాడు వాడు.

"-నీ శ్రాద్ధం, నీ బాబు శ్రాద్ధం, వెధవల్లారా! మాకేవన్నా గతి లేదనుకున్నారా నాయనా? వెధవ పని చేసింది కాక జగ్గు వెనక్కి ఇమ్మని పెళాయింపా? ఏం నాయనా, మీ ఇంట్లో పాయిఖానాల్లోకి స్టీలు, ఇత్తడి పాత్రలు తీసుకెడతారా? మీకు అంత గోరోజనమా? లేక చుట్టాలింటికొచ్చి విలాసం వెలగబెడతారా? త్రాష్టపు పీనుగుల్లారా! వెళ్లు వెళ్లు! మరోసారి జగ్గు గిగ్గు అన్నావంటే పిలక సాగదీసి చంపుతాను లంబ్డి కొడకా!" అంటూ జడివానలా మా దొడ్డమ్మ రెచ్చిపోవడంతో, అంత వానలోనూ భోగరాజు వారబ్బాయి పరుగందుకున్నాడు.

000

వాన వెలిసిన తర్వాత కచ్చేరీకి బయలుదేరాను. దారిలో ఆ కుర్రాడు తగిలినాడు. ఏడుపొక్కటే తక్కువ!

"-ముసలావిడకు ఇది తగునా? అజీర్తి చేత మా నాయన క్షణికావేశంతో అలా చేసినాడే అనుకోండి. అదేమంత దారుణమా? మీ ఇంటి కొచ్చిన ప్రతి వాడికి ఇదే కథ ఆవిడ చెప్పడం, వాళ్లెప్పుడో మా నాయనను కలసినపుడు ఆయన్ని ఆరా తీయడం! చిక్కి శల్యమైపోయినాడు ఈ బెంగతో! మా నాయన స్వాతంత్ర్యపోరాటాన్నీ, గాంధీ గారినీ, అహింసాసిద్ధాంతాన్నీ ఈవిడ ఏకి పారేస్తోందని వొకటే ఘోష! ఇదేవన్నా తగునా? వొక్క జగ్గుతో మనిషి ఔన్నత్యాన్ని దెబ్బతీయడం! కమ్యూనిస్టులు కూడా ఇంత దారుణానికి దిగరే!!" అంటూ కన్నీళ్ల పర్యంతమైనాడు. పార్వతీశము పోరాటవ్యక్తిత్వాన్ని వొక్క జగ్గుతో తోడి అవతల పారేసింది మా దొడ్డమ్మ.

"-అయితే ఏమిటి సాధనం?" అని అడిగాను.

"-ఆ పాత స్టీలు జగ్గు మీ ఇంటి నుండి తీసుకొని స్టీమరు గోదారి మధ్యకొచ్చిన తర్వాత అందులో పారేసి రమ్మని మా నాయన సెలవు! తీరా ఇలా జరిగింది" అన్నాడు వాడు.

"-ఇప్పుడు ఆ జగ్గును మాయం చేయడం కాని పని. తెలిసిందంటే మన బుర్ర రామకీర్తన పాడుతుంది ఆవిడ. అంచేత వో పని చేయి. ఈ జగ్గు గోదాట్లో పారేసి అంతా నువ్వు చెప్పినట్టే చేశానని మీ నాయన వద్ద బొంకు. మరి మార్గాంతరం లేదు. కొన్నాళ్ల పాటు విషయం మరిచిపోయిన తర్వాత పాత జగ్గు నేను అవతల పారేస్తాను" అని భరోసా ఇచ్చాను. ఆ కుర్రవాడి వాలకము, అతడి వాదం, అతడి తండ్రి పరిస్థితి నన్ను కలచివేసినవి. తన వినోదార్థం జగ్గు కథని వ్యంగ్యంగా పదిమందికీ చెప్పే మా దొడ్డమ్మ తీరు నాకెంత మాత్రం ఇక నచ్చలేదు. కుర్రవాడు బితుకు బితుకుమంటూ వెళ్లిపోయాడు.

000

***సరిగ్గా మూడు నెలలు గడవనిచ్చి, వొక రోజు రాత్రి ఈ కథావస్తువైన జగ్గును నూతిలో పారేశాను. ఇక్కడితో సరి! ఎవడో ఎత్తుకుపోయాడని వూరుకుంటుంది. కథ కంచికి వెడుతుంది. అంతవరకే నేను వూహించగలిగాను. కాని కథ నిలువునా అడ్డం తిరిగింది.***

000

భూగోళం మొత్తం మీద సవాలక్ష విషయాలు విచారిస్తూ పోతూంటేనే మన వంటి ఎడ్యుకేషన్ గల సిటిజన్స్‌కు టయిము ఎంతో మిగులుతున్నది. మరి గ్రాస్ విడో అయినటువంటి మా దొడ్డమ్మ వంటి వారలకు? ఆమె జీవితంలో ఆమె మాత్రమే సృష్టించగలిగిన సంచలనవార్త జగ్గు వుదంతం. తన వినోదాన్నీ, సృజనాత్మకతనూ ఆమె ఆ కథలో రంగరించింది. అదే ఆవిడకు కరెంటు అఫైరు. ఇక టయిము గడుచుట యెట్లు? ఏ గాడ్డె కొడుకయినా రికార్డు చేసుంటే ప్రపంచసాహిత్యచరిత్రలో చిరస్మరణీయమైన శిల్పాలతో ఆ జగ్గు చుట్టూ అల్లిన కథలు మా దొడ్డమ్మకు గొప్ప సాహిత్యగౌరవం కల్పించేవి. ఇలాటి అవకాశం పోవడం అంటే మా దొడ్డమ్మలోని కథకురాలిని హత్యచేయడమే!

000

నాలుగు రోజులు ఆవిడ మిన్నకుంది.

హమ్మయ్యా అనుకున్నాను! అది తుఫాను ముందరి ప్రశాంతత అని నాకు తెలియదు. కథకులని హత్యించడం యెవరి తరమూ కాదు. జగ్గు పోయిన విషయం చాలా సీరియస్‌గా తీసుకున్నది. దానితో పాటు మరి కొన్ని సామానులూ పోయినట్లు మా పింతల్లి కొడుకూ, ప్లీడరు గుమాస్తా అయినటువంటి శివన్నారాయణ ద్వారా పోలీసు రిపోర్టు ఇప్పించింది. ఆ రిపోర్టు లిస్ట్‌లో మొదటి వస్తువు భోగరాజు పార్వతీశము జగ్గు విలువ సుమారు 18 రూపాయలు. ఇక తతిమ్మావి!

మనుషులే బేఖాతరుగా వున్న రోజుల్లో వొక జగ్గుకు అంత పెద్ద పేరు, దానికో కథ వుండడంతో పోలీసులు ఆశ్చర్యపోయారు. ఆసక్తికరమైన ఈ వుదంతం పై అధికారుల వరకూ పాక్కింది. పైగా మా దొడ్డమ్మ రోజా పోలీసు స్టేషను ముందు యాగీ మొదలుపెట్టింది. విషయం పేపర్లకు ఎక్కింది. ఉత్సాహులగు కొందరు స్ట్రింగరులు మా దొడ్డమ్మ చెప్పిన పార్వతీశము జగ్గు కథను స్థానిక పేజీలలో మానవీయకథనాలుగా రాసి లైనుకింతని సొమ్ము చేసుకున్నారు.

నా గుండె గుభేల్‌మంది-ఈ గొడవ ఇంకెంత దూరం పోనున్నదో అని!

000

ఈ గొడవ ఇలా సాగుతుండగా వొకనాడు స్థానిక పేపరు నందు "జగ్గు పార్వతీశము కన్ను మూత" అని వార్త చదివి నిరుత్తరుడనయినాను.

ఆయన స్వాతంత్ర్యసమరయోధుడు. కానీ తాజా గొడవ వల్ల జగ్గు ఆయన విశిష్టలక్షణం అయినది. ఎంక్వయిరీ చేయగా జగ్గు వుదంతం కలచివేయడంతో ఆయన తీసుకు తీసుకు మరణించినాడని తెలిసినది. ఈ విషయం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వూహించలేను గానీ, కథకులతో అందునా 'సహజ' కథకులతో చెలగాటం ఆడితే ఎంత ప్రమాదమో నాకు తెలిసివచ్చింది. పత్రికలు వార్తలనే కాదు, కథకులనూ తయారుచేయగలవు! ■